



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి

# సత్యసాయి సేవలే స్ఫూర్తి

- సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్-4 కో ఆర్డినేటర్ గౌతమ్

7




7

# ప్రగతి బాట..!

- పరిశ్రమలొచ్చేస్తున్నాయ్..
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పూర్వవైభవం
- మడకశిరకు మందుగుండు తయారీ సంస్థ
- జిల్లావైపు ఔత్సాహికుల చూపు

# నత్తనడకన సర్వే

- మొరాయిస్తున్న మొబైలు డివైజ్‌లు
- గైర్హాజరవుతున్న సచివాలయ సిబ్బంది
- సెలవులోకి వెళ్తున్న వైనం
- మిగిలింది ఐదు రోజులే..
- గడువులోగా పూర్తవడంపై సందేహాలు

హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్‌కు సమస్యలు



జియో ట్యాగింగ్ చేస్తున్న సచివాలయ ఉద్యోగి

కదిరి అర్బన్/ధర్మవరం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో కుటుంబాల వివరాలు తెలుసుకునేందుకు, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం చేపట్టిన హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్ సర్వే నత్తనడకన సాగుతోంది. సర్వేకి వెళ్తే మొబైల్ డివైజ్‌లు మొరాయిస్తున్నాయి. ఈ ప్రక్రియ చేపట్టాల్సిన సచివాలయ సిబ్బంది వివిధ కారణాలు చూపుతూ సెలవులోకి వెళ్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాదు, సర్వే కోసం ఇళ్ల వద్దకెళ్తే ఆయా కుటుంబీకులు కొంతమంది సహకరించడం లేదని సిబ్బంది వాపోతున్నారు. సైబర్ నేరాల భయంతో వేలిముద్రలు వేసేందుకు నిరాకరిస్తున్నారని వారు చెబుతున్నారు. కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని సమాచారం. వెరసి సర్వే నత్తనడకన సాగుతోంది. ఈనెల 25వ తేదీలోగా పూర్తి చేయాలని గడువు విధించారు. ఇప్పటి వరకు 55.73 శాతం సర్వే పూర్తయింది. మిగిలినది ఐదు రోజులే. ఆలోగా పూర్తవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## అన్ని వివరాలు ఒకే యాప్‌లో..

ప్రభుత్వం హౌస్‌హోల్డ్ జియో మ్యాపింగ్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. జిల్లాలో ప్రతి ఇంటినీ ప్రభుత్వంతో అనుసంధానిస్తుంది. జీఎస్‌డబ్ల్యూఎస్ ఎంప్లాయిస్ అనే యాప్‌లో జియో ట్యాగింగ్ చేస్తారు. ఆ యాప్‌లో ప్రతి ఇంటి ఫొటో, డోర్ నంబరు, లొకేషన్‌ను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రతి ఇంటికీ సచివాలయ ఉద్యోగులు వెళ్లి, ఆ కుటుంబ వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారు. వాటిని ధ్రువీకరిస్తూ కుటుంబసభ్యుల్లో ఒకరితో ప్రత్యేక డివైజ్ ద్వారా వేలిముద్రలు, ఫేస్, ఐరీష్ పద్ధతిలో ఆమోదం తీసుకుంటున్నారు. గతంలో సంక్షేమ పథకాల ఆధారంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ఉండేది. ఉదాహరణకు పింఛన్లకు సంబంధించి ఒక మ్యాపింగ్, రేషన్ కార్డులకు సంబంధించి మరొకటి ఉండేది. ఆయా పథకాల పంపిణీకి మాత్రమే అవి ఉపయోగపడేవి. ఈ చిక్కులను తొలగించి మొత్తం వ్యవహారాన్ని ఒక చోటికి చేర్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రతి కుటుంబానికి సంబంధించి ఆ ఇల్లు ఉండే అక్షాంశం, రేఖాంశం ఆధారంగా జియో ట్యాగింగ్ చేస్తోంది. తద్వారా ఎవరెక్కడ ఉన్నారనే విషయం సెకన్లలో తెలిసిపోతుంది. ఈ ప్రక్రియ ఈనె 6వ తేదీన అన్ని జిల్లాల్లో ప్రారంభమైంది. జిల్లాలో నత్తనడకన సాగుతోంది. వాస్తవానికి ఈనెల 15వ తేదీ నాటికి పూర్తి కావాల్సి ఉంది. అనుకున్న స్థాయిలో సాగకపోవడంతో 25వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అప్పట్లోగా కూడా పూర్తవడం కష్టమేనని తెలుస్తోంది.

## జిల్లాలో పరిస్థితి ఇదీ..

జిల్లావ్యాప్తంగా 6,20,076 కుటుంబాలున్నాయి. ఇప్పటివరకూ 3,45,541 కుటుంబాల సర్వే (55.73 శాతం) పూర్తయింది. సచివాలయ ఉద్యోగులు కొందరు సర్వే చేయకుండా తప్పించుకు తిరుగుతున్నట్లు సమాచారం. మరికొందరు ఉన్నత ఉద్యోగ పరీక్షలకు సన్నద్ధమవుతున్నామంటూ సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. వీరి పరిధిలో చేయాల్సిన కుటుంబ సర్వేను ఆ సచివాలయంలో మిగిలిన ఉద్యోగులు చేయాల్సి రావడం వారికి భారంగా మారింది.

## పనిచేయని డివైజ్‌లు..

సర్వే కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో కుటుంబ వివరాలు పూర్తిగా నమోదు చేయాల్సి ఉంది. వేలిముద్ర వేసేందుకు ఇచ్చిన డివైజ్‌లు సరిగా పనిచేయడం లేదు. కొన్నిప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ సమస్య తలెత్తుతోంది. కొన్ని సచివాలయాల్లో పూర్తిస్థాయి సిబ్బంది లేరు. ఒక్కొక్కరు 400 కుటుంబాలకుపైగా సర్వే చేయాల్సి వస్తోందని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. వలంటీర్లు తిరిగి ఇచ్చేసిన మొబైళ్లు కూడా సరిగా పనిచేయడం లేదని ఆవేదన చెందుతున్నారు. సొంత మొబైల్‌ను వినియోగిస్తామంటే యాప్ భారాన్ని అవి తట్టుకోలేక పోతున్నాయని తెలిపారు. ట్యాబ్‌లు, మంచి స్టోరేజ్ ఉన్న సెల్ ఫోన్లు, డివైజ్‌లను అందజేస్తే సర్వేను సమర్థవంతంగా, వేగవంతంగా పూర్తిచేస్తామని వారు చెబుతున్నారు.

## వేలిముద్ర వేయం

ఇంటింటా సర్వేకు వెళ్తున్న సచివాలయ ఉద్యోగులకు కొన్నిచోట్లవింత అనుభవాలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల బెడద ఎక్కువగా ఉండడంతో పేద, మధ్యతరగతి ప్రజలు సర్వేకి వెళ్లిన ఉద్యోగులకు వేలి ముద్రలు వేయమంటూ తెగేసి చెబుతున్నారు. తమ వివరాలు కావాలంటే తీసుకోండి కానీ, బయోమెట్రిక్ మాత్రం వేయమంటున్నారు. కొందరైతే ఇంటి వద్దకు కూడా సర్వే బృందాలను రానివ్వడం లేదని సచివాలయ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. తమకు ఎలాగూ ప్రభుత్వ పథకాలు, ఏ ఇతర లబ్ధి రాదు, కాబట్టి తాము ఎలాంటి వివరాలు వేలిముద్రలు ఇవ్వమంటూ స్పష్టం చేస్తున్నారు. ఈ వరుసలో పోలీసులు మొదటి వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. ఐటీ చెల్లింపులు, కార్లు ఇతర వాహనాలు ఉన్న ప్రైవేటు వ్యక్తులు కూడా తమ వివరాలు వెల్లడించడం లేదని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు.

## వారం రోజుల్లో పూర్తి చేస్తాం

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జియో ట్యాకింగ్ కార్యక్రమం మరో వారం రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే దాదాపు పూర్తయింది. కొన్ని మండలాల్లో కొన్నిశాఖలకు సంబంధించిన సిబ్బంది సహకరించాల్సి ఉంది. ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించాం.

- సుధాకర్‌రెడ్డి, వార్డు, గ్రామ సచివాలయాల ప్రత్యేకాధికారి

# ప్రత్యేక కేంద్రాల ద్వారా ఉల్లి విక్రయాలు

- కలెక్టర్ చేతన్



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అన్ని మండలకేంద్రాల్లో ప్రత్యేక కేంద్రాల ద్వారా ఉల్లి విక్రయాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిత్యవసరాల ధరల పర్యవేక్షణ, నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నిత్యావసరాల ధరల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు మార్కెట్ యార్డు నుంచి ఉల్లిని దిగుమతి చేసుకుని, ప్రత్యేక కేంద్రాల ద్వారా విక్రయించాలని సూచించారు. కందిపప్పు, టమోటా, ఉల్లి ధరల నియంత్రణపై చర్చించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడీ మూర్తి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# తిమ్మమ్మ మర్రిమాను అభివృద్ధికి చర్యలు

- డీఎఫ్ఓ చక్రపాణి



తిమ్మమ్మ మర్రిమాను వద్ద సమస్యలు తెలుసుకుంటున్న డీఎఫ్ఓ

నంబులపూలకుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూటిబైలు గ్రామంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమాను అభివృద్ధికి చర్యలు చేపడతామని జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) చక్రపాణి తెలిపారు. ఆయన బుధవారం తిమ్మమ్మ మర్రిమానును సందర్శించారు. తిమ్మమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు.. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి, తిమ్మమ్మ మర్రిమాను అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నేపథ్యంలో డీఎఫ్ఓ సందర్శించారు. వసతులపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సందర్శకులు బస చేయడానికి వసతులు లేవనీ, బస్‌షెల్టర్, కాటేజీలు, గదుల నిర్మాణం చేపడితే ఈప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని డీఎఫ్ఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటనారాయణ, శ్రీనివాసులు, నారాయణస్వామి, సర్పంచ్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

# వీఆర్వోపై బాధితుల ఆగ్రహం



వీఆర్వో గిరిధర్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చింతా నాగార్జున



వీఆర్వో లంచం అడిగాడని ఆరోపిస్తున్న రైతు శ్రీలత

ధర్మవరం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద దర్శినమల వీఆర్వో గిరిధర్ రెడ్డిపై బుధవారం బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన చింతా నాగార్జున గరుడంపల్లిలో భూమి కొనుగోలు చేశాడు. ఆ భూమిలో అదే గ్రామ ప్రజలు 30 ఏళ్లుగా పశువుల దొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. వారికి పొజిషన్ పట్టాలు ఇస్తానని వీఆర్వో ఇటీవల చెప్పినట్లు చింతా నాగార్జునకు తెలిసింది. దీంతో అతడు బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని, వీఆర్వో గిరిధర్ రెడ్డిని కలిశాడు. గరుడంపల్లి వద్ద భూమి గ్రామ ప్రజల అనుభవంలో ఉందని వీఆర్వో తెలపడంతో చింతా నాగార్జున మండిపడ్డాడు. దీంతో ఇరువురి మధ్య గొడవ మొదలైంది. వీఆర్వో గిరిధర్ రెడ్డి గతంలో చిగిచెర్ల, పోతుకుంట, కుణుతూరు పంచాయతీలకు వీఆర్వోగా పనిచేశారు. ప్రస్తుతం ఆయనను కనగానపల్లి మండలానికి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన తహసీల్దార్ కార్యాలయానికి రావడంతో చింతా నాగార్జున ఆగ్రహం వ్యక్తం చేశాడు. గరుడంపల్లి వీఆర్వో కాకపోయినా.. పొజిషన్ పట్టాలు ఇస్తానని ఎలా చెబుతావని మండిపడ్డాడు. దూషణలకు దిగాడు. వీఆర్వో గిరిధర్ రెడ్డి కూడా అదేస్థాయిలో దూషించారు. ఇంతలోనే అక్కడికి మండలంలోని పోతుకుంటకు చెందిన మహిళారైతు శ్రీలత వచ్చింది. సర్వే నంబరు 695-1లోని తన భూమి పత్రాల కోసం వీఆర్వో గిరిధర్ రెడ్డిని సంప్రదించగా.. అదే కార్యాలయంలోని ఓ ప్రైవేటు వ్యక్తి ద్వారా రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడని ఆరోపించింది. గొడవను అక్కడున్న వారు వీడియో తీసి, సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇది వైరల్‌గా మారింది. ఇదే విషయమై తహసీల్దార్ సురేష్‌బాబును అడగ్గా.. మహిళారైతు శ్రీలతను కార్యాలయానికి పిలిపించి, విచారించామన్నారు. వీఆర్వో లంచం డిమాండ్ చేయించినట్లు ఆమె చెప్పారన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు.

# ఉషా.. మీ నాయకత్వం వద్దు..!

- మీ అవినీతి లెక్కలున్నాయ్..
- బహిరంగ చర్చకు సిద్ధమా?
- రాష్ట్రం నుంచి మిమ్మల్ని బహిష్కరించాలి
- గోరంట్ల నాయకుల ధ్వజం
- వైసీపీ బహిష్కృత నేతల సమావేశానికి పెద్ద ఎత్తున హాజరు



సమావేశానికి హాజరైన శంకర్‌నారాయణ వర్గం నాయకులు

గోరంట్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల్లో పార్టీ ఫండ్ రూ.20కోట్లు వస్తే, రూ.13కోట్లు ఖర్చు చేసి, రూ.7కోట్లు మింగేశావు. రాప్తాడు సిద్ధం సభకు నియోజకవర్గానికి రూ.కోటి ఇస్తే రూ.పదిలక్షలు ఖర్చు చేసి, రూ.90 లక్షలు దిగమింగలేదా? మీ నాయకత్వాన్ని అంగీకరించే ప్రసక్తే లేదు. మీ అవినీతి లెక్కలన్నీ మా వద్ద ఉన్నాయి. బట్టబయలు చేస్తాం. బహిరంగ చర్చకు సిద్ధమా' అని గోరంట్ల మండలానికి చెందిన వైసీపీ బహిష్కృత నేతలు.. ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్‌కు సవాల్ విసిరారు. తమను పార్టీ నుంచి బహిష్కరించడం కాదనీ, ఉషనే రాష్ట్రం నుంచి బహిష్కరించాలని ధ్వజమెత్తారు. గోరంట్లకు చెందిన మాజీ మంత్రి శంకర్ నారాయణ వర్గీయులు పాటూరి శంకర్‌రెడ్డి, నాగేనాయక్, కుటాల బాబును వైసీపీ నుంచి సస్పెండ్ చేశారు. ఆ ముగ్గురితోపాటు శంకర్‌నారాయణ వర్గీయులు గోరంట్లలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీపై అసమ్మతి నేతలు విరుచుకుపడ్డారు. ఆమె నాయకత్వాన్ని అంగీకరించే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. ముగ్గురిని సస్పెండ్ చేస్తే అందరూ చెప్పినట్లు వింటారని ఉషశ్రీ కుట్రపన్నారని వారు మండిపడ్డారు. పాటూరి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మండల, పట్టణ కన్వీనర్లను ఇష్టారాజ్యంగా మార్చి గ్రూపు రాజకీయాలు చేస్తోంది ఉషశ్రీ చరణ్ అని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆమె ప్రవర్తనతో విసిగిపోయి, వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇన్నాళ్లూ ఆమె ఆగడాలు భరించామనీ, ఇకపై ఆమె నాయకత్వాన్ని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. నాగేనాయక్ మాట్లాడుతూ.. తమ సమావేశానికి పార్టీ నాయకులను వెళ్లవద్దని చెప్పడం ఉషశ్రీ నియంత పోకడలకు నిదర్శనమన్నారు. ఆమె ఉడత ఊపులు, బెదిరింపులకు బెదిరేదిలేదన్నారు. 'రాష్ట్రమంతా తిరుగుతూ నీ అనితీతిని ప్రచారం చేస్తూ నిన్ను రాష్ట్రంలోనే లేకుండా చేస్తాన'ని హెచ్చరించారు. 'నీ అవినీతిని నిరూపించలేకపోతే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా. నిరూపిస్తే నీవు శాశ్వతంగా రాజకీయాలు వదిలి, కర్ణాటకకు వెళ్లడానికి సిద్ధమా' అని సవాల్ విసిరారు. సమావేశంలో వైసీపీ నాయకులు ప్లకార్డులు పట్టుకుని ఉష వద్దనీ, పెనుకొండ నియోజకవర్గాన్ని కాపాడాలంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

# 26న ధర్నాకు తరలిరండి

### సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



జీపుజాతాలో మాట్లాడుతున్న ఓబులు

కళ్యాణదుర్గం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు తరలి రావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం పట్టణంలోని బాబూజగ్జీవన్‌రామ్ సర్కిల్ వద్ద నిర్వహించిన జీపు జాతాలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, విద్యుత్ సవరణ బిల్లు-2022ను రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లు, గృహ వినియోగానికి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఆపాలని, రైతుల రుణమాఫీ చేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ ఇతర సంఘాల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, శ్రీరామిరెడ్డి, వన్నూరుస్వామి, పాతక్క, రంగనాథ్, రఘు, నరేష్ పాల్గొన్నారు.

# రైతు ఉత్పత్తులకు సొసైటీల సహకారం

### జిల్లా సహకార శాఖాధికారి అరుణకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహకార శాఖాధికారి అరుణకుమారి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు పండించే పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, సకాలంలో విక్రయించడానికి సహకార సొసైటీలు ఎంతగానో తోడ్పడుతున్నాయని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమామారి పేర్కొన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు సభ బుధవారం స్థానిక రామ్‌నగర్ లోని రాయలసీమ సహకార శిక్షణా కేంద్రంలో నిర్వహించారు. 'స్థిరమైన అభి వృద్ధి లక్ష్యాల సాధనలో, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సును ఉద్దేశించి డీసీఓ మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు చిన్నస్థాయి రైతులు, మత్స్యకారులు, ఉత్పత్తిదారులకు అవసరమైన మార్కెట్ సదుపాయం కల్పిస్తాయని అన్నారు. రైతులకు పంటల దిగుబడి పెంచడం, పెట్టుబడి తగ్గించడం, మౌలిక వసతులు కల్పించడంలో, ప్రజలకు ఆహారభద్రత పెంచడంలో సొసైటీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అర్బన్‌బ్యాంకు ఛైర్మన్ జేఎల్ మురళీధర్ మాట్లాడుతూ సహకార వ్యవస్థ ఆవిర్భావం తెలియజేస్తూ మార్పులు చేర్పులను వివరించారు. ప్రస్తుతం అర్బన్‌బ్యాంకు నాలుగు బ్రాంచ్‌లు ద్వారా సేవలు అందిస్తున్నామని, మరో ఆరు బ్రాంచ్‌ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, డీఎల్‌సీఓ ప్రభాకర్‌రెడ్డి, విశ్రాంత సీఈఓ నరసింహారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు నాగవీణ, మేథిని, సహకార విద్యాధికారి మురళీమోహన్ పాల్గొన్నారు.



# మార్కెట్ యార్డులు ఏవీ..?




- బోర్డుకే పరిమితమైన శింగనమల
- స్థల కేటాయింపు లేని రాప్తాడు
- వైసీపీ హయాంలో ఆర్భాటంగా జీవోలు



**నిధులు మంజూరు చేయాలి**

శింగనమల మార్కెట్ యార్డుకు స్థలం కేటాయించారు. దిష్టిబొమ్మలాగా బోర్డు ఏర్పాటు చేశారు తప్ప ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. రైతుల అవసరాల దృష్ట్యా వెంటనే మార్కెట్ యార్డుకు నిధులు మంజూరు చేసే విధంగా ఎమ్మెల్యే చొరవ చూపాలి.

- నారాయణస్వామి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి



బుక్కరాయసముద్రం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి ఒక మార్కెట్ యార్డు అంటూ గత వైసీపీ ప్రభుత్వం చేసిన ఆర్భాటపు ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. తమ పార్టీ నాయకులకు నామినేటెడ్ పదవులు పంపకం కోసమే అన్నట్లుగా తయారయింది. ప్రతి నియోజకవర్గంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తున్నట్లు జీవో జారీ చేసింది. రైతులు కూడా తాము పండించిన పంటలను సమీపంలోనే విక్రయించుకోవచ్చని ఆశించారు. కానీ ఎక్కడా వాటికి భవనాలు నిర్మించలేదు. అనంతపురం జిల్లాలో గతంలో అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, ఉరవకొండలో మార్కెట్ యార్డులు ఉండేవి. ప్రతి నియోజక వర్గానికి ఒక మార్కెట్ యార్డు ప్రకటనలో భాగంగా 2021లో వైసీపీ ప్రభుత్వం శింగనమల, రాప్తాడు నియోజక వర్గాలకు కమిటీలు ఏర్పాటు చేసింది. శింగనమల నియోజకవర్గం మార్కెట్ యార్డు కోసం బుక్కరాయసముద్రం మండలంలోని జంతులూరు వద్ద ఓపెన్ ఎయిర్ జైలుకు సంబంధించిన స్థలంలో 10 ఎకరాలు కేటాయించారు. బోర్డు పెట్టి భూమి పూజ చేసి వదిలేశారు. ఇప్పటి వరకు ఆ స్థలంలో ఒక్క ఇటుక పెళ్ల కూడా వేయలేదు. నూతన భవనాలు, గోడౌన్లు తదితర అభివృద్ధి పనులకు రూ.3.75 కోట్లతో అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. 2021లో నివేదికలు పంపినా ఇంత వరకు నిధులు మంజూరు కాలేదు. రాప్తాడు నియోజకవర్గంలో మార్కెట్ యార్డు పేరుకే ఉంది. కనీసం స్థలం కూడా కేటాయించ లేదు. గతంలో రాప్తాడు, సీకేపల్లి మండలాల్లోని జాతీయ రహదారి పక్కన 10 ఎకరాలు స్థలం కోసం పలు చోట్ల చూశారు. ఎక్కడా అనువైన భూములు లేకపోవడంతో స్థల కేటాయింపు జరగలేదు. రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న టమాటా మార్కెట్‌లో భారీ స్థాయిలో విక్రయాలు జరుగుతున్నాయి. కక్కలపల్లి రహదారిలో ప్రైవేటు స్థలాల్లో మార్కెట్ ఏర్పాటు చేసుకుని క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. పుట్టపర్తి మార్కెట్ యార్డుకు స్థలం కేటాయించలేదు. కొత్తచెరువులో సబ్ మార్కెట్ యార్డుగా ఉన్న దానినే కొనసాగిస్తున్నారు. అదనంగా గోరంట్ల మార్కెట్ యార్డు కేటాయించారు.

### యార్డు లేక తీవ్ర ఇబ్బందులు



శింగనమల నియోజకవర్గంలో మార్కెట్ యార్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తున్నట్లు నాలుగు సంవత్సరాల క్రితం ప్రభుత్వం చెప్పింది. ఈ ప్రభుత్వ హయాంలోనయినా నిధులు మంజూరు చేసి భవనాలు, గోడౌన్ల నిర్మాణం చేపట్టాలి.

- గోపాల్‌నాయుడు, రైతు, జంతులూరు

### భవన నిర్మాణాలకు అంచనాలు వేస్తున్నాం

శింగనమల మార్కెట్ యార్డు భవన నిర్మాణాలకు అంచనాలు వేస్తున్నాం. రూ.4.75 కోట్లతో అంచనాలు వేసినట్లు డీఈ, జేఈ తెలిపారు. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం. రాప్తాడు నియోజకవర్గానికి ఇప్పటి వరకు స్థలం దొరకలేదు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. యార్డుకు స్థలం దొరికిన వెంటనే అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక పంపుతాం.

- సత్యనారాయణచౌదరి, ఏడీ, మార్కెట్ యార్డు

### త్వరగా నిర్మాణం చేపట్టాలి



రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో వెంటనే మార్కెట్ యార్డు నిర్మాణం చేపట్టాలి. గతంలో వైసీపీ చేసిన నిర్లక్ష్యమే కూటమి ప్రభుత్వం చేస్తోంది. నిర్మాణం కోసం వెంటనే నిధులు మంజూరు చేయాలి. రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలి.

- నల్లప్ప, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

### జాకీ పరిశ్రమను

# మళ్లీ తీసుకురండి

**అసెంబ్లీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత**

**మంత్రులకు వినతిపత్రాలు**



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాప్తాడులో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కమీషన్ల బెదిరింపులతో తరలిపోయిన జాకీ పరిశ్రమను తిరిగి అదే ప్రాంతంలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో జాకీ సంస్థ రాప్తాడు సమీపంలో పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందన్నారు. 2017లో పరిశ్రమ ఏర్పాటు కోసం ఏపీఐఐసీ ద్వారా 27 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని గుర్తు చేశారు. రూ.129 కోట్ల పెట్టుబడితో ఏడాదికి 32.4 మిలియన్ల దుస్తులను తయారు చేసే పరిశ్రమ పనులను 2018లోనే ప్రారంభించారని తెలిపారు. ప్రహరీ నిర్మాణం పూర్తి చేసి పరిశ్రమకు సంబంధించిన సామగ్రిని ఇక్కడికి తరలించే సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ సమయంలో అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, అతడి సోదరులు పరిశ్రమ యాజమాన్యం నుంచి రూ. 15 కోట్లు డిమాండ్ చేశారన్నారు. దీంతో పరిశ్రమ తెలంగాణకు తరలిపోయిందన్నారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి కల్పించే అవకాశం కోల్పోయిందన్నారు. జాకీ పరిశ్రమను ప్రారంభించాలని టీడీపీతో పాటు సీపీఐ నాయకులు చలో జాకీ పరిశ్రమ కార్యక్రమాన్ని నిర్వహిస్తే.. ప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతో 40 మంది నాయకులపై అక్రమంగా కేసులు పెట్టించారన్నారు. ఇందులో తనతో పాటు తన కుమారుడు పరిటాల శ్రీరామ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణలు ఉన్నారన్నారు. ఇతర గార్మెంట్స్ పరిశ్రమలు తీసుకొస్తామని ప్రగల్భాలు పలికిన నాటి ఎమ్మెల్యే ఏ ఒక్క పరిశ్రమను తీసుకురాలేదన్నారు. కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన ప్రోత్సహకాలు కొనసాగిస్తూ జాకీ పరిశ్రమను తిరిగి వచ్చేలా చూడాలన్నారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు చాంబర్లో ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌లు భారీ, చిన్న తరహా పరిశ్రమల శాఖల మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్‌ను కలిశారు. జాకీ పరిశ్రమను తిరిగి తీసుకురావాలని వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై మంత్రులు స్పందిస్తూ ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# రైతులకు రక్షణ కవచం పంటల బీమా

### విస్తృతంగా అవగాహన కల్పించాలి: కలెక్టర్ వినోద్‌కుమార్



పంటల బీమా చేయండి.. రక్షణ కవచం పొందండి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులకు పంటల బీమా రక్షణ కవచం లాంటిందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో పంటల బీమాపై జిల్లా స్థాయి పర్యవేక్షణా కమిటీ (డీఎల్ఎంసీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రబీ సీజన్‌కు సంబంధించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్, కరువు, అకాల వర్షం తదితర ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంట దిగుబడి నష్టపోతే ఆర్థికసాయం అందుతుందని వివరించారు. వాతావరణ ఆధారిత బీమాకు సంబంధించి మామిడి పంటకు ఎకరాకు రైతు వాటా రూ.1650 చెల్లిస్తే రూ.33వేల బీమాను వర్తింపజేస్తారన్నారు. టమోటా పంటకు ఎకరాకు రూ.1600 చెలిస్తే రూ.32వేల బీమాను వస్తుందన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారిత బీమాకు వేరుశనగకు ఎకరాకు రూ.480 చెల్లిస్తే రూ.32వేల బీమా, జొన్నకు రూ.315 చెల్లిస్తే రూ.21వేలు, మొక్కజొన్నకు రూ.525 చెల్లిస్తే రూ.35వేలు, వరికి రూ.630 చెల్లిస్తే రూ.42వేలు, పప్పుశనగకు ఎకరాకు రూ.450 చెల్లిస్తే రూ.30వేల బీమా మొత్తాన్ని చెల్లిస్తారని వివరించారు. అనంతరం పంటల బీమా చేయండి.. రక్షణ కవచం పొందండి, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, సీపీఓ అశోక్‌కుమార్, డీహెచ్ఓ నరసింహారావు, డీపీఎం నాగరాజునాయుడు, ఎల్‌డీఎం నర్సింగరావు, ఎస్‌బీసీ డీఐఓ రవిశంకర్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ అధికారి దాసు, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ స్టేట్ ప్రెసిడెంట్ ప్రశాంత్, జిల్లా మేనేజర్ నరసింహమూర్తి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## పంటల్లో పండు ఈగ నివారణపై నేడు శిక్షణ

అనంతపురం అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల్లో పండు పక్వానికి వచ్చే సమయంలో పంట దిగుబడిని తగ్గించే పండుఈగ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యాన పంటలను విదేశాలకు ఎగుమతి చేయడంపైనా చర్చిస్తామన్నారు. శిక్షణకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఉద్యాన అధికారులు, రైతులు హాజరుకావాలని సూచించారు.

## కార్యదర్శులు అప్‌డేట్ చేసుకోవాలి: డీపీఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు స్వర్ణ పంచాయతీ పోర్టల్లో తమ ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేసుకోవాలని డీపీఓ నాగరాజనాయుడు ఆదేశించారు. బుధవారం డీపీఓ చాంబర్‌లో డీఎల్‌పీఓ సుమనజయంతితో కలిసి అనంతపురం రూరల్ మండలంలోని కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు శాఖాపరమైన అంశాలపై చర్చించారు. ఇంటి పన్నుకు సంబంధించి వందశాతం వసూళ్లు చేపట్టేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులందరికి సమాచారం చేరవేయాలని ఈఓఆర్డీలను ఆదేశించారు. సమావేశంలో ఈఓఆర్డీ వెంకటనాయుడు, కార్యదర్శులు అశోక్‌బాబు, శ్రీధర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ కూలీ మృతి

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ కూలీ మృతిచెందాడు. కక్కలపల్లి కాలనీకి చెందిన ఎర్రిస్వామి(43) అమరావతి సీడ్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈనెల 16న టవర్‌క్లాక్ బ్రిడ్జిపై వెళ్తుండగా ఆటో ఢీకొంది. దీంతో తీవ్రగాయాలకు గురైన అతన్ని బెంగుళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎస్సీ, ఎస్టీ మహిళలకు స్వయం ఉపాధి

**స్వయం సహాయక సంఘాల ద్వారా అమలు**

**ఎస్సీలకు 68, ఎస్టీలకు 863 యూనిట్లు మంజూరు**



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ మహిళలకు స్వయం ఉపాధి పథకాలు అమలు చేయనున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ఈ కార్యక్రమాలు చేపట్టనున్నారు. కోడిపిల్లల పెంపకం ద్వారా ఎస్టీ మహిళలకు 863 యూనిట్లు, స్వయం ఉపాధి పథకం ద్వారా ఎస్సీ మహిళలకు 68 యూనిట్లు కేటాయించారు.

**ఎస్టీ మహిళలకు 863 కోడిపిల్లల యూనిట్లు**

స్వయం సహాయక సంఘాల్లో ఉండే ఎస్టీ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కోడిపిల్లల పెంపకానికి జిల్లాకు 863 యూనిట్లు కేటాయించింది. యూనిట్ విలువ రూ.6వేలు కాగా ఇందులో ప్రభుత్వం రూ.3600 చెల్లించనుండగా, లబ్ధిదారులు రూ.2,400 చెల్లించాల్సి ఉంటుంది. కోడిపెట్టలు 11, కోడిపుంజులు 5 అందిస్తారు. 30 కిలోల దానా, మెడికల్ కిట్ అందజేస్తూ, రవాణా ఉచితంగా చేస్తారు. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి ఎస్టీ కార్పొరేషన్ ద్వారా డీఆర్‌డీఏ-వెలుగుకు రూ.45 లక్షల నిధులు కేటాయించారు.

**ఎస్సీ మహిళలకు 68 యూనిట్లు**

స్వయం సహాయ మహిళా సంఘాల్లో ఉండే ఎస్సీ మహిళలకు కేంద్రప్రభుత్వం ద్వారా ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై) ద్వారా జిల్లాకు 68 యూనిట్లు మంజూరు చేశారు. ఎంపిక చేసిన ఎస్సీ మహిళలకు రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు బ్యాంకు ద్వారా రుణం అందజేస్తారు. ఉన్నతి కార్యక్రమంలో భాగంగా జీవనోపాధుల పెంపునకు ఈ పథకాన్ని అమలు చేస్తారు. కేంద్రప్రభుత్వం 50 శాతం సబ్సిడీ, 10 శాతం లబ్ధిదారుల వాటా, 40 శాతం బ్యాంకు ద్వారా రుణం అందజేస్తారు. వ్యవసాయరంగం, స్వయం ఉపాధి, చిరు వ్యాపారం, కుటీర పరిశ్రమ ఏర్పాటుకు ఈ పథకం వర్తిస్తుంది.

### అర్హులను గుర్తిస్తున్నాం



స్వయం సహాయక సంఘాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవనోపాధుల పెంపునకు పథకాలు అమలు చేస్తున్నారు. ఇందులో లబ్ధిదారులను ఎంపిక చేయడానికి కసరత్తు చేస్తున్నాం. ఎస్టీ మహిళలకు జిల్లాకు 863యూనిట్లు కోడిపిల్లల పెంపకం చేపట్టనున్నాం. ఎస్సీ మహిళలకు 68 పీఎంఏజేఏవై యూనిట్లు జిల్లాకు కేటాయించారు. రెండు పథకాలు ఎస్సీ, ఎస్టీ మహిళల కుటుంబాల్లో వెలుగులు నింపనున్నాయి. -ఈశ్వరయ్య, పీడీ, డీఆర్‌డీఏ-వెలుగు

# జనవరి 3 నుంచి ఎస్ఎస్‌బీఎన్ వార్షికోత్సవాలు

**హాజరుకానున్న కేంద్ర, రాష్ట్రమంత్రులు**

**పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు**



మాట్లాడుతున్న ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీసాయిబాబు జాతీయ పాఠశాల, కళాశాలల (ఎస్ఎస్‌బీఎన్) 80వ వార్షికోత్సవాలను పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. కళాశాల ఆవరణంలో మూడ్రోజుల పాటు వేడుకలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమానికి పాఠశాల, కళాశాలల్లో చదివి దేశ విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు, ఐఏఎస్ అధికారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ఆహ్వానం పలికేలా పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల సంఘం బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించింది. సంఘం జిల్లా అధ్యక్షుడు పరుచూరి రమేష్‌బాబు మాట్లాడుతూ.. ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులు ఎంతో మంది కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎస్పీలు, డీఎస్పీలుగా స్థిరపడ్డారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆ పూర్వ విద్యార్థులతో పాటు... చదువులు నేర్పించిన పూర్వ గురువులతో 80 వసంతోత్సవాల పేరిట ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని అన్నారు. జనవరి 3న పాఠశాల, 4న జూనియర్, 5న డిగ్రీ, పీజీ కళాశాలల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిఒక్క విద్యార్థి ఎక్కడున్నా ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు పీఎల్ఎన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్ఆర్ నాగభూషణం, కార్యదర్శి సుంకు వేణుగోపాల్, సహాయ కార్యదర్శులు శివచంద్ర, అన్నపూర్ణ, కోశాధికారి చంద్రశేఖర్ గుప్త, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళపై టీడీపీ నాయకుల దాడి

**సోషల్ మీడియాలో వైరల్.. నలుగురిపై కేసు నమోదు**



మహిళపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు లో మహిళపై టీడీపీ నాయకులు దాడిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొత్తచెరువులోని నెహ్రూ కాలనీలో సిమెంటు రోడ్డు మంజూరైంది. కాలనీలోని నెమలి పార్వతమ్మ ఇంటి వద్ద రోడ్డు నిర్మాణానికి మెట్లు, డ్రైనేజీ గుంత అడ్డు వచ్చాయి. ఆక్రమణలు తొలగించుకోవాలని ఆమెకు అధికారులు సూచించారు. ఆమె ససేమిరా అనడంతో ఈనెల 19న టీడీపీ నేతలు వెళ్లి తొలగించుకోవాలన్నారు. అమె ససేమిరా అనడంతో టీడీపీ నాయకులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించే పనులు చేపట్టారు. పార్వతమ్మ అడ్డుకుంది. టీడీపీ నాయకులు.. ఆమెను పక్కకు నెట్టేసే క్రమంలో వాగ్వాదం తలెత్తింది. ఈ సందర్భంలో తనపైకే దాడి కొస్తావా అంటూ పార్వతమ్మను టీడీపీ నాయకులు కొట్టారు. ఈఘటనపై వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా బుధవారం పోస్టు పెట్టారు. అది వైరలైంది. తనపై టీడీపీ నాయకులు దాడి చేసినట్లు పార్వతమ్మ కొత్తచెరువు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో టీడీపీ నాయకుడు శ్రీనివాసులు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. పార్వతమ్మపై టీడీపీ నాయకులు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

## పేదలు ఇళ్లు కట్టుకోవాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గుత్తి రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని అధికారులకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమారు సూచించారు. జక్కలచెరువులో బుధవారం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. సొంతిల్లు లేని ప్రతిఒక్కరూ ఇల్లు కట్టుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 65 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. అందులో 30 పూర్తయ్యాయని, మిగిలినవారు నిర్మించుకోవాలని సూచించారు. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందిస్తుందని తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ శైలజ, ఎంపీపీ విశాలాక్షి, టీడీపీ నాయకులు ఈశ్వర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ బాల్ బ్యాడ్మింటన్

# పోటీలకు ఎంపిక



అనిల్



పావని

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌస్‌మెహిద్దీన్, వెంకటేశులు, గౌరవాధ్యక్షుడు ఈశ్వరయ్య తెలిపారు. కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన టి.అనిల్ ఆర్ట్స్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతూ బాల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నాడు. ఇటీవల నంద్యాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మెరుగైన ప్రతిభతో మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. అదేవిధంగా ధర్మవరానికి చెందిన పావని జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఇదివరకే రాజశేఖర్, శ్రీనాథ్ జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా నుంచి ఈ ఏడాదిలో నలుగురు క్రీడాకారులు జాతీయ పోటీలకు అర్హత సాధించడం శుభసూచికమని వారు అభినందనలు తెలిపారు.

## వచ్చే నెలలో సాగునీటి సంఘాల ఎన్నికలు



ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలకు డిసెంబరు మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు హెచ్చెల్సీ, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈలు రాజశేఖర్, విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికలపై బుధవారం సాయంత్రం స్థానిక జడ్పీలోని డీపీఆర్సీ భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95, హెచ్చెల్సీ పరిధిలో 54 సాగునీటి సంఘాలు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా సాగునీటి సంఘాల పరిధిలోని ఆయకట్టు రైతుల ఓటర్ల జాబితాలను ఆయా మండలాలు, గ్రామ పంచాయతీ పరిధిలో ప్రదర్శించామని తెలిపారు. ఇప్పటికే అభ్యంతరాలు కూడా అందజేశారని, అందుకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేశామన్నారు. డిసెంబరు మొదటి వారంలో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు, నిర్వహణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు వెంకటరమణారెడ్డి, రాజ్‌కుమార్, ఇంజనీర్లు, ఎన్నికల అధికారులు, సహాయాధికారులు, పోలింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్రైంకార్నర్

### అప్పులబాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య



ఆదినారాయణ (ఫైల్)

పరిగి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అప్పుల ఉరికి మరో నేతన్న వేలాడాడు. మండలంలోని పెద్దరెడ్డిపల్లికి చెందిన చేనేత కార్మికుడు ఆదినారాయణ(44) అప్పుల బాధ భరించలేక బుధవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరేసుకుని, మరణించాడు. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదినారాయణ కూలి మగ్గం పనులకు వెళ్తుండేవాడు. పనులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. కుటుంబ పోషణకు కొంతమేర అప్పులు చేశాడు. ఇద్దరు కుమార్తెలకు మరింత చేశాడు. దీంతో మొత్తం అప్పు రూ.8లక్షలు దాటింది. దానిని ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపం చెందిన అతడు బుధవారం తెల్లవారుజామున తన ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కాసేపటికి గమనించిన కుటుంబీకులు అతడిని కిందకు దించారు. అప్పటికే అతడు మరణించాడు. ఆదినారాయణ భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు జమేదార్ శ్రీనివాసులు తెలిపారు. ఆదినారాయణకు ఇద్దరు కుమార్తెలు, 9వ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు.

### భార్య హత్యకేసులో భర్తకు జీవిత ఖైదు

అనంతపురం క్రైం/గుంతకల్లు టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భార్యను వరకట్న వేధింపులకు గురి చేయడంతో పాటు ఆమెను హత్య చేసిన కేసులో సుబ్రహ్మణ్యం నాయక్ అనే వ్యక్తికి జీవిత ఖైదు శిక్ష ఖరారయింది. ఈ మేరకు బుధవారం అనంతపురం అడిషనల్ ఫోర్త్ సెషన్స్ మహిళా కోర్టు న్యాయాధికారి శోభారాణి తీర్పును వెల్లడించారు. గుంతకల్లు పట్టణం అరవిందనగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం నాయక్‌కు కదిరి మండలం రాచువారిపల్లికి చెందిన అఖిలతో 2021లో వివాహమైంది. వివాహ సమయంలో 10 తులాల బంగారం ఇచ్చారు. కొంత కాలానికే రూ.10 లక్షలు అదనపు కట్నం, ఒకటిన్నర ఎకరం పొలం తన పేరుతో రాయించాలని, లేకపోతే చంపేస్తానని భర్త ఆమెను తరచూ వేధించేవాడు. టిక్ టాక్ వీడియోలు చేస్తోందని అనుమానంతో హింసించేవాడు. ఈ క్రమంలో 2022 ఏప్రిల్ 1న సుబ్రహ్మణ్యం నాయక్ అఖిలపై విచక్షణారహితంగా దాడి చేసి గొంతు కోసి హత్య చేశాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అదే ఏడాది ఏప్రిల్ 1న గుంతకల్లు వన్‌టౌన్ అప్పటి సీఐ నాగశేఖర్ కేసు నమోదు చేశారు. అనంతరం సీఐ రామసుబ్బయ్య దర్యాప్తు కొనసాగించారు. పూర్తి వివరాలతో అడిషనల్ ఫోర్త్ సెషన్స్ మహిళా కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. 13 మంది సాక్షులను విచారించిన న్యాయాధికారి శోభారాణి నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవిత ఖైదు జైలు శిక్ష, రూ.15వేల జరిమానా విధించారు. కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సీఐ వెంకటేష్ నాయక్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెచ్‌సీ సోరెడ్డి, కానిస్టేబుల్ నాగేంద్రయ్య సాక్షులను సకాలంలో హాజరు పరిచారు. వారిని జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు.

### దొంగకు జైలు శిక్ష

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చోరీకి పాల్పడిన ఓ దొంగకు 10 నెలల జైలు శిక్ష పడింది. ఈ ఏడాది మే 18న రాత్రి గుంతకల్లు పట్టణానికి చెందిన చాకలి నారాయణ తన కుటుంబ సభ్యులతో కలిసి పక్క ఇంట్లో నిద్రించాడు. నల్లబోతుల వాసు అనే వ్యక్తి నారాయణ ఇంట్లోకి చొరబడి రూ.68వేల విలువైన జత బంగారు కమ్మలు, మూడు జతల వెండి కాళ్ల పట్టీలు, సామ్‌సంగ్ టీవీ, చిన్న పిల్లల బట్టలు దొంగలించాడు. ఈ కేసులో మొబైల్ న్యాయాధికారి సుజిన్ ముద్దాయికి 10 నెలల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు ప్రకటించారు.


### యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అన్నా, వదినలు వేరు కాపురం పెట్టడానికి తనే కారణమంటున్నారని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతపురంలోని భవానీనగర్‌కు చెందిన దుర్గప్పకు ఇద్దరు కుమారులు దేవరకొండ చంద్రశేఖర్, కార్తీక్ ఉన్నారు. కార్తీక్ (24) ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. అన్న, వదినలు వేరు కాపురం పెట్టారు. వారు వేరు కాపురం పెట్టడానికి తమ్ముడే కారణమని చుట్టుపక్కల వారు అంటున్నట్లు విన్నాడు. దీనికి తోడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఉరి వేసుకుని మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


### వ్యక్తి అదృశ్యం

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆస్తి పంపకాల విషయంలో ఓ వ్యక్తి అలక వహించి ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. నగర శివారులోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన నజీర్ సోదరుల మధ్య ఆస్తి వివాదం నెలకొంది. ఈ క్రమంలో బుధవారం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. భార్య షేకుం నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సత్యసాయి మహాసమాధి




ఆన్‌లైన్ ద్వారా నేపాల్‌లో నీటిపథకాన్ని ప్రారంభిస్తున్న రత్నాకర్



భక్తిపాటలు ఆలపిస్తున్న నేపాల్ భక్తులు



# సత్యసాయి సేవలే స్ఫూర్తి



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

- సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్-4 కో ఆర్డినేటర్
- ఆన్‌లైన్ ద్వారా నేపాల్‌లో నీటి ప్రాజెక్టు ప్రారంభం
- మూడోరోజు సత్యసాయి సేవాదళ్ సదస్సులు
- భక్తులను అలరించిన వేణునాదం

పుట్టపర్తి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా సేవలే స్ఫూర్తి అని సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్-4 కోఆర్డినేటర్ డాక్టర్ నారాయణ బహదూర్ గౌతమ్ పేర్కొన్నారు. సత్యసాయిబాబా జయంత్యుత్సవాల మూడోరోజు బుధవారం స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్‌లో సత్యసాయి సేవాదళ్ సదస్సులు నిర్వహించారు. నేపాల్‌కు చెందిన సత్యసాయి సేవాసంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన నీటి పథకాన్ని ప్రశాంతి నిలయంనుంచి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. నేపాల్‌లో చేపట్టిన సేవా కార్యక్రమాలను ఆ దేశానికి చెందిన డాక్టర్ నారాయణ బహదూర్ గౌతమ్ వివరించారు. గతేడాది శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఛైర్మన్ చక్రవర్తి నీటి పథకానికి భూమిపూజ చేశారన్నారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టును రత్నాకర్ ప్రారంభించడం ఆనందదాయకమన్నారు. దేశంలో మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి 8 కమ్యూనిటీ డ్రింకింగ్ ప్రాజెక్టులు నిర్మించామన్నారు. మూడు కిలోమీటర్లు పైపులైన్ వేసి రెండు వేల గృహాలకు తాగునీరు అందించామన్నారు. వీటితోపాటు పాఠశాలల్లో సైతం తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టామన్నారు. సత్యసాయి చూపిన బాటలోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన వివరించారు. అనంతరం నేపాల్ యువత భక్తిగీతాలు ఆలపించారు. సాయంత్రం జేఏ జయంత్ బృందం వేణునాదంతో భక్తులను మైమరపింపజేసింది. సేవా కార్యక్రమల్లో చురుగ్గా పాల్గొన్న నేపాల్ యువతకు ఆర్జే రత్నాకర్ ప్రశంసాపత్రాలు అదించి, అభినందించారు.

### నారాయణ సేవకు క్యూకట్టిన భక్తులు

సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొనే భక్తులకు ట్రస్టు ఆధ్వర్యంలో నారాయణసేవ చేపట్టారు. బుధవారం దాదాపు ఐదువేల మంది భక్తులు నారాయణ సేవ స్వీకరించారు. ప్రశాంతి నియలంలోని సాయి కుల్వంత్ మందిరంతోపాటు యజుర్‌మందిరం, గోపురం, గణేష్‌గేటు ప్రాంతాల్లో ప్రత్యేక దీపాలంకరణ చేశారు. వేడుకల్లో దేశ,విదేశాలకు చెందిన వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

### నేడు సేవాసంస్థల సదస్సులు

సత్యసాయి జయంతి వేడుకల నాలుగోరోజు గురువారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో శ్రీసత్యసాయి సేవాసంస్థల సదస్సులు నిర్వహించనున్నారు. సేవా కార్యక్రమాలపై చర్చిస్తారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

నారాయణ సేవ స్వీకరిస్తున్న భక్తులు





విద్యుద్దీపాలంకరణలో సాయికుల్వంత్

# ప్రగతి బాట..!

- జిల్లాకు పరిశ్రమలొచ్చేస్తున్నాయ్..
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పూర్వవైభవం
- మడకశిరకు మందుగుండు తయారీ సంస్థ
- భూముల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం

పుట్టపర్తి/మడకశిర, నవంబరు20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో జిల్లాకు పరిశ్రమలు వచ్చేస్తున్నాయ్. పారిశ్రామిక రంగానికి పూర్వవైభవం వస్తోంది. జిల్లాలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలతోపాటు రహదారుల అభివృద్ధి, అనుసంధానం, ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. జిల్లాలో వెనుకబడిన మడకశిర ప్రాంతానికి పారిశ్రామిక మహర్దశ పట్టనుంది. తాజాగా నియోజకవర్గంలో మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమకు భూములు కేటాయించేందుకు రాష్ట్ర మంత్రిమండలి బుధవారం ఆమోదం తెలిపింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఇటీవల తొలి ఢిల్లీ పర్యటనలోనే జిల్లాలకు జాతీయ రహదారుల అనుసంధానం, విస్తరణతోపాటు జాతీయ రహదారుల వెంట పారిశ్రామిక కారిడార్‌కు ప్రోత్సాహకాలు, అభివృద్ధికి బాటలు పడ్డాయి. పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంగా అమెరికాలో మంత్రి నారా లోకేశ్ ఇటీవల పర్యటించారు. ఈ సందర్భంగా విద్యుత్ వాహనా(ఈవీ)ల బ్యాటరీ తయారీ పరిశ్రమను అనంత జిల్లాలో ఏర్పాటు చేయాలని దిగ్గజ సంస్థ టెస్లాను కోరారు. దీంతో అందరి చూపు శ్రీసత్యసాయి జిల్లా వైపు మళ్లింది. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో మడకశిరలో మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### మందుగుండు తయారీ పరిశ్రమకు భూములు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగస్టులో మడకశిర ప్రాంతంలో పర్యటించారు. సాగు, తాగునీటి సమస్య పరిష్కరించడంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చేసి లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే మడకశిర మండలం బుల్లసముద్రం, హరేసముద్రం, మనూరు, కల్లుమర్రి గ్రామాల పరిధిలో 10 వేల ఎకరాల్లో సోలార్ పార్క్ ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చిన మూడు నెలలు పూర్తికాకనే మడకశిర ప్రాంతంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. 2012లో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటు ద్వారా పరిశ్రమలు నెలకొల్పడానికి భూములు సేకరించారు. గౌడనహళ్లి, ఆర్ అనంతపురం, చత్రం గ్రామాల పరిధిలో 1600 ఎకరాలు గుర్తించారు. 2022లో సెజ్‌కు సంబంధించి 1443 ఎకరాల భూములను సేకరించారు. మడకశిర మండలం సి.కొడిగేపల్లి, కేతేపల్లి వద్ద 2006లో 1230 ఎకరాల భూమిని సేకరించారు. ఇలా మడకశిర నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు 3043 ఎకరాల భూములను సిద్ధం చేశారు. గత వైసీపీ హయాంలో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదముద్ర పడింది. భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కల్యాణీ స్ట్రాటిజిక్ సిస్టం లిమిటెడ్ (కేఎస్ఎస్ఎల్) రక్షణ రంగానికి అవసరమైన ఫిరంగుల మందుగుండు సామగ్రి పరిశ్రమకు భూములు కేటాయించారు. మొదటి దశలో రూ.1430 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 565 మందికి ఉపాధి లభించనుంది. దీంతో ఈప్రాంత ప్రజల్లో ఉపాధి అవకాశాలపై ఆశలు రేగుతున్నాయి.




ఆర్.అనంతపురం పారిశ్రామిక వాడ

### జిల్లా వైపు ఔత్సాహికుల చూపు

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూములను 2014-19 మధ్య గత టీడీపీ హయాంలో గుర్తించారు. పెనుకొండ, పాలసముంద్రం, కప్పలబండ, హిందూపురం, మడకశిర మండలం రాళ్లఅనంతపురం, గోళ్లాపురం, గుడిపల్లి, దాదులూరు, శెట్టిపల్లి, సడ్లపల్లి, కొటిపి, కేతిగానిచెరువు, కుటాగూళ్ల వద్ద 10వేల ఎకరాలకుపైగా ఏపీఐఐసీ సేకరించింది. పెనుకొండ మండలం అమ్మవారుపల్లి, కప్పలబండ, కొటిపి, గోళ్లాపురం, గుడిపల్లి వద్ద ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేశారు. పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి, కదిరి, హిందూపురం, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో భూములు సేకరించే పనిలో ఏపీఐఐసీ నిమగ్నమైంది. నీరు, భూముల లభ్యత, జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం, హైదరాబాద్-బెంగళూరు హైవే విస్తరణతో పారిశ్రామిక ప్రగతికి రెక్కలొస్తాయి. రెండు, మూడేళ్లలో జిల్లాలో రవాణా అనుసంధానం పెరిగి పారిశ్రామిక కారిడార్‌గా అవతరించనుంది. ఉపాధి కల్పన జిల్లాగా మారబోతోంది. అన్ని నియోజకవర్గాల్లో అనువైన భూములున్న నేపథ్యంలో టెస్లా పరిశ్రమ ఉమ్మడి అనంతలో ఏర్పాటుకు ఆసక్తి చూపితే ఏ నియోజక వర్గంలో పెడతారన్న చర్చ నడుస్తోంది.

### ఎయిర్ కనెక్టివిటీ... ఎంత దూరం..?

పారిశ్రామిక, వ్యవసాయ రంగాలతోపాటు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునే దిశగా జిల్లా దూసుకెళుతోంది. కూటమి అధికారంలోకి రావడంతో జిల్లావైపు పారిశ్రామిక దిగ్గజాలు తొంగిచూస్తున్నారు. ఈనేపథ్యంలో జిల్లాలో ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాష్ట్రంలో ఉన్న ఏడు ఎయిర్‌పోర్టుల సంఖ్యను 14కి పెంచేందుకు అవకాశాలపై రెండు నెలల కిందట సీఎం చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు చర్చించారు. అందులో భాగంగా జిల్లాలో ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు సన్నాహాలు ప్రారంభించారు. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు నిర్వహిస్తున్న విమానాశ్రయాన్ని పబ్లిక్ ఎయిర్‌పోర్టుగా మార్చి, పౌరవిమానాశ్రయ సేవలు ఎలా ప్రారంభించాలన్న దానిపై చర్యలు మొదలెట్టారు. ఇప్పటికే రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటు, విస్తరణకు చర్యలు ప్రారంభించారు. పుట్టపర్తిలో ప్రజా విమానయాన సేవలు అమలు చేసేందుకు చర్యలు సాగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు పరిశ్రమలు క్యూకడుతున్న నేపథ్యంలో పౌర విమానాలు దిగే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.

### ఉత్తమ పోలీసులకు పురస్కారాలు

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా గత నెలలో ఉత్తమ సేవలు అందించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ ఎస్పీ జగదీష్ బుధవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. దొంగలను అరెస్టు చేసి సొత్తు రికవరీ చేయడం, కీలకమైన కేసుల్లో కఠిన శిక్షలు పడేలా చేయడం, చీటింగ్ కేసుల్లో నిందితులను అరెస్టు చేయడం, వివిధ అంశాలపై సమాచారం ఇవ్వడంలో కృషి చేసిన 24 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతపురం రూరల్ సీఐ శేఖర్, గుత్తి సీఐ వెంకటేశ్వర్లు, కళ్యాణదుర్గం సీఐ నీలకంఠేశ్వర్, కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ వెంకటేష్‌నాయక్, లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐలు లోక్‌నాథ్‌చౌదరి(ఎస్బీ), అనంతపురం రూరల్ ఎస్ఐ రాంబాబు, 9 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, ఆరుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులను ఎస్పీ అభినందించారు.

### గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక వన్‌టౌన్ పోలీసులు బుధవారం రెండు కిలోల 30 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. టీవీ టవర్ సమీపంలో ఎన్టీఆర్ కాలనీకి చెందిన దూదేకుల శంషాద్‌వలి, టీవీ టవర్ వద్ద ఉంటున్న అబ్దుల్‌ఖాదర్ జిలాన్ గోశాల సమీపంలో గంజాయిని తీసుకెళ్తుండగా అరెస్టు చేశారు.

### మహిళపై దుర్భాషలు.. ఏడాది జైలు శిక్ష

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓ మహిళను దుర్భాషలాడి బెదిరించిన కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలు శిక్ష పడింది. 2022 ఫిబ్రవరి 19న త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ మహిళ ఇంట్లోకి రమేష్ అనే వ్యక్తి వెళ్లి దుర్భాషలాడి, బెదిరించాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ హరినాథ్ కేసు నమోదు చేశారు. బుధవారం స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి శివశంకర్ ముద్దాయికి ఏడాది జైలు శిక్ష, రూ.3వేలు జరిమానా విధించారు.

### ఆర్టీసీ డ్రైవర్ల నిజాయతీ

నాలుగు తులాల బంగారం అప్పగింత



సోమయ్యకు బంగారం, పత్రాల బ్యాగును అందిస్తున్న డిపో మేనేజర్ ఇనయతుల్లా

పుట్టపర్తి టౌన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణీకుడు మరచిపోయిన బ్యాగును సంబంధీకుడికి అప్పగించి ఆర్టీసీ పుట్టపర్తి డిపోకి చెందిన డ్రైవర్లు నారాయణ, శేఖర్ నిజాయతీ చాటుకున్నారు. పుట్టపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనయతుల్లా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి పుట్టపర్తికి ఈనెల 19న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు బయల్దేరింది. అందులో నెల్లూరు జిల్లా వాకాడు మండలం కోడూరుపాళ్యానికి చెందిన సోమయ్య వచ్చాడు. నాలుగు తూలాల బంగారం, పత్రాలతో కూడిన బ్యాగును బస్సులోనే మరచిపోయి, వెళ్లిపోయాడు. పుట్టపర్తి డిపోకి చేరుకున్న డ్రైవర్లు నారాయణ, శేఖర్ బ్యాగును గమనించి, డిపో మేనేజర్ ఇనయతుల్లాకు అప్పగించారు. దీంతో డిపో మేనేజర్ వివరాలు సేకరించి, సోమయ్యకు సమాచారం అందించారు. బుధవారం పుట్టపర్తిలో బంగారంతోపాటు పత్రాలున్న బ్యాగును ఆయనకు అందించారు.

### రైల్లో నుంచి పడి యువకుడి మృతి

గుత్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వేస్టేషన్ పరిధిలోని యార్డు వద్ద రైల్లో నుంచి జారి పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప బుధవారం తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడికి 28 సంవత్సరాలు ఉంటాయని, 5.2 అడుగులు ఎత్తు, బ్లూ జీన్స్ మిక్స్ కలర్ ప్యాంట్, షర్ట్ ధరించాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## న్యూస్‌బాక్స్

### టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 30 తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 23, కనిష్ఠ ధర రూ. 16 పలికినట్లు ఆయన తెలిపారు.

### చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ. 38,300 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 14వేలు, సరాసరి రూ. 23,500తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 60 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

### 1,051 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 1051 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 745 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.616 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

### గడువు పొడిగింపు

లేపాక్షి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 సంవత్సరానికిగాను 9, 11 తరగతుల్లో ప్రవేశ దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సర ప్రవేశానికి ఫిబ్రవరి 8న అర్హత పరీక్ష నిర్వహిస్తారన్నారు. పరీక్ష దరఖాస్తు గడువు ఈనెల 19వ తేదీతో ముగిసిందన్నారు. దానిని ఈనెల 26వ తేదీ వరకు పొడిగించారన్నారు.

# కష్టాలు.. అపారం..!

**అపార్ కార్డు కోసం కేంద్ర ప్రభుత్వం పెట్టిన నిబంధనలు .. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అష్టకష్టాలు పెడుతున్నాయి. పాఠశాలల రికార్డుల్లో.. ఆధార్ కార్డుల్లో పేరు, పుట్టిన తేదీ ఒకే విధంగా ఉంటేనే అపార్ కార్డు వస్తుంది. అయితే పేరు, పుట్టిన తేదీ తప్పుగా ఉండటంతో వాటిని సరిచేసుకోవడానికి వారాల తరబడి కార్యాలయాలు, ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. సమయం, డబ్బు వృథా అవుతున్నాయే తప్పా.. సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. విధానాలను సులభతరం చేసేలా ఉన్నతాధికారులు చొరవ చూపకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు విసిగి వేసారి పోతున్నారు.**



కదిరి బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఆధార్ మార్పు కోసం వేచి ఉన్న విద్యార్థినులు

- వారాలైనా పరిష్కారం కాని సమస్యలు
- పేరు, పుట్టిన తేదీ మార్పుకు ఇబ్బందులు
- కార్యాలయాలు, ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ
- పట్టించుకోని అధికారులు
- చదువులో వెనుకబడుతున్న విద్యార్థులు
- తగ్గుతున్న హాజరుశాతం

కదిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశపెడుతున్న అపార్ కార్డు .. విద్యార్థులు, వారి తలిదండ్రులను ముప్పుతిప్పలు పెడుతోంది. వారు వారాల తరబడి పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ఆధార్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నా.. సమస్యలు పరిష్కారం కావడం లేదు. పాఠశాల రికార్డుల్లోనూ, ఆధార్‌లోనూ ఒకేరకంగా వివరాలుంటేనే అపార్ కార్డు జనరేట్ అవుతోంది. ఈ రెండు చోట్లు వివరాలు ఒకే విధంగా మార్పు చేయడానికి విద్యార్థులు, తల్లిదం డ్రులు అన్ని కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకపోవడంతో వారి చదువులో వెనకబడుతున్నారు. ఇలా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధికారుల కళ్లేదుటే అపార్ కష్టాలు పడుతున్నా.. వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అపార్ కార్డు పొందేందుకు విధానాలను సులభతరం చేయడం లేదు. మరోపక్క ఉన్నతాధికారులు ఉపాధ్యాయులకు గడువు విధిస్తూ అపార్ కార్డులు పూర్తి చేయాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. దీంతో ఆ ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఒత్తిళ్లు తెస్తుండటంతో.. వారు ఏం చేయాలో అర్థం కాక అయోమయంలో పడుతున్నారు.

● ఇంటి పేరుతో ఇబ్బందులు

అపార్ కార్డు జనరేట్ కావాలంటే స్కూల్ రికార్డుల్లోనూ, ఆధార్‌కార్డులోనూ ఇంటిపేరు ఒకే రకంగా ఉండాలి. సాధారణంగా స్కూల్ రికార్డులో ఇంటిపేరుతో పాటు విద్యార్థి పేరుంటింది. ఆధార్ కార్డు వచ్చే పాటికి ఆ సమయంలో ఎక్కువ మంది ఇంటి పేరు పూర్తిగా కాకుండా ఇన్షియల్ (మొదటి అక్షరం) మాత్రమే పెట్టి నమోదు చేయించుకున్నారు. ప్రస్తుతం అపార్ కార్డు జనరేట్ కావాలంటే ఈ రెండు ఒకే రకంగా ఉండాలి. చాలా మందికి రెండు చోట్ల ఒకే రకంగా పేరు ఉండకపోవడంతో అపార్ కార్డులు జనరేట్ కావడంలేదు.

● కష్టాలు ఇలా మొదలు...

ఇంటిపేరు మార్చుకోవాలంటే మొదట జనన ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ఆ పత్రం కోసం సచివాలయంలో వివరాలు రాసిస్తే, వారు తహసీల్దార్‌కు పంపుతారు. అక్కడ నమోదైయి ఉంటే అక్కడ నుంచే ధ్రువీకరణ పత్రం ఇస్తారు. ఒకవేళ విద్యార్థి పుట్టినప్పుడు ఎక్కడా నమోదు చేయకపోతే నాన్‌అవేబుల్ అనే సర్టిఫికెట్‌ను ఆర్డీఓ జారీ చేస్తారు. అక్కడ నుంచి తిరిగి సచివాలయం, తహసీల్దార్ కార్యాలయానికి పంపితే, అక్కడ జనన ధ్రువీకరణ పత్రం ఇంటి పేరుతో ఇస్తారు. ఈతతంగం పూర్తి కావాలంటే కనీసం 20.. 30 రోజులు పడుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇంటిపేరు, ఆధార్‌లో ఉన్న పేరును ధ్రువీకరిస్తూ తల్లిదండ్రుల వద్ద డిక్లరేషన్ తీసుకుంటే సరిపోతోంది. ఈ మార్పు ప్రభుత్వం ఎందుకు చేయలేకపోతోందని ఆ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

● పుట్టిన తేదీ... పుట్టెడు కష్టాలు

స్కూల్ రికార్డుల్లో ఉన్న పుట్టిన తేదీ, ఆధార్ కార్డులో ఉన్న పుట్టిన తేదీ ఒకే విధంగా లేకపోతే అపార్ కార్డు జనరేట్ కాదు. పుట్టిన తేదీ సవరించాలంటే డేటాఫ్ బర్త సర్టిఫికెట్ (జనన ధ్రువీకరణ పత్రం) అవసరం. ఈ పత్రం కావాలంటే సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం, అక్కడ నుంచి ఆర్డీఓ కార్యాలయం వెళ్లాలి. ఈ తతంగం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తలనొప్పిగా మారింది.

● రోజుల తరబడి తిరుగుతున్నా..

విద్యార్థుల వివరాలు మార్చుకోవడానికి ఆధార్ సెంటర్లు, గ్రామ సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ విద్యార్థులు, తల్లిదండ్రులు తిరుగుతున్నారు. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతుండడతో విద్యార్థులు చదువు చుట్టబండలవుతోంది. హాజరు శాతం తగ్గిపోతోంది. చదువు ముందుకు సాగడంలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. అంతేకాకుండా సమయం, డబ్బు వృథా అవుతోందంటున్నారు. ప్రభుత్వం ఈ నిబంధనలు మార్చాలని కోరుతున్నారు.

### ఇబ్బందులు పడుతున్నాం..



ఇంటి పేరు ఆధార్‌లో తప్పు ఉండడంతో సరిచేసుకోవడానికి రెండు రోజులుగా ఆధార్ కేంద్రం వద్దకు వస్తున్నా. బర్త్ సర్టిఫికెట్ కదిరి మున్సిపాలిటీలో ఇవ్వడంతో ఇంటి పేరు కూడా అక్కడే మార్చుకోవాలని ఆధార్ సెంటర్ వారు చెబుతున్నారు. మున్సిపాలిటీకి వెళ్తే అక్కడ పనికావడంలేదు. ఈ ఇబ్బందులు శత్రువు కూడా రాకూడదు స్వామీ..

- వెంకటేష్, కొండమర్ల

## న్యూస్ బాక్స్

### హైందవ శంఖారావం పోస్టర్ విడుదల

నల్లమాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావం సభకు సంబంధించిన పోస్టర్‌ను విశ్వ హిందూ పరిషత్ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. స్థానిక రామాలయంలో బుధవారం నిర్వహించిన ఆ కమిటీ సమావేశంలో వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు బుట్టి నాగభూషణ నాయుడు మాట్లాడారు. హైందవ శంఖారావం సభకు హిందువులం దరూ తరలిరావాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అశోక్‌కుమార్, బయ్యారెడ్డి, నరసింహులు, చిన్న వెంకటరాముడు, మహేంద్రనాయక్, అరవిందు బాబు, హనుమంతురెడ్డి, గోవిందురెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

### మహిళలపై దాడులను అరికట్టాలి

కదిరి అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులు, దౌర్జాన్యాలు, అత్యాచారాలను అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ కన్వీనర్ దిల్‌సాద్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన ఐద్వా జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళ రక్షణ చట్టాలు, కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. మహిళలు పనిచేసే ప్రాంతాల్లో లైగింక వేధింపులు ఎక్కువ య్యాయని, మహిళలకు రక్షణ కల్పించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు విఫలమయ్యాయని అన్నారు. అనంతరం ఐద్వా నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షురాలిగా లక్ష్మీదేవి, ప్రధాన కార్యదర్శిగా నాగమణి, ఉపాధ్యక్షురాలిగా గౌతమి, సహాయ కార్యదర్శిగా శాంతిబాయి, కోశాధికారిగా చంద్రమ్మ, మరో ఆరుగురిని సభ్యులుగా ఎంపిక చేశారు.

### 23న పాఠశాలలకు సెలవు

కొత్తచెరువు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు ఈనెల 23న స్థానిక సెలవుగా ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సెలవు నల్లమాడ, బుక్కపట్నం, పుట్టపర్తి, కొత్తచెరువు మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు మాత్రమే వర్తిస్తుందన్నారు.

### ఈయూ ధర్మవరం డిపో అధ్యక్షుడిగా తిరుమలేశ్



ధర్మవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ధర్మవరం డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా తిరుమలేశ్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎంపికచేశారు. ఈ ఎంపిక ధర్మవరం ఆర్టీసీ డిపో ఆవరణంలో ఈయూ రీజనల్ ఉపాధ్యక్షుడు బి.నరసింహులు, జిల్లా అధ్యక్షుడు కేబీ నాగార్జునరెడ్డి, సీనియర్ నాయకులు శ్రీరాములు సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఈయూ డిపో కార్యదర్శి ముస్తాఫా, డిపో చైర్మన్ సుమో శీనసడీసీ మల్లికార్జున, గ్యారేజ్ జాయింట్ సెక్రటరీ భాస్కర్ పాల్గొన్నారు.

### అనారోగ్యంతో సర్వేయర్ మృతి



ఆనంద్‌నాయక్ (ఫైల్)

గాండ్లపెంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల సర్వేయర్ ఆనంద్ నాయక్ (60) బుధవారం అనారోగ్యంతో మరణించాడు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో చికిత్సలు పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో కదిరిలోని మొటుకుపల్లిలోని ఆయన నివాసంలో మరణించాడు. తహసీల్దార్ బాబురావు, సిబ్బంది ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఆనంద్ నాయక్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

### ఇన్‌చార్జ్ ఎంఈఓగా వేమనారాయణ



ముదిగుబ్బ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా వేమనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎంఈఓ-1 కిరణ్మయి వారంరోజుల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. ఆ స్థానంలో నల్లమాడ ఎంఈఓ వేమనారాయణను ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో స్థానిక ఎమ్మార్సీలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

### అప్‌గ్రేడ్ సీఐగా నిరంజన్‌రెడ్డి



కదిరి అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కదిరి అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐగా నిరంజన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ మోహన్ పుట్టపర్తి వీఆర్‌కు వెళ్లారు. ఆ స్థానంలో నంద్యాల సీసీఎస్‌లో సీఐగా పనిచేస్తున్న నిరంజన్‌రెడ్డి ఇక్కడికి వచ్చారు.

### సీపీఎం మండల కార్యదర్శిగా బేళ్ల అంజి

పుట్టపర్తి టౌన్, నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి): సీపీఎం పుట్టపర్తి మండల కార్యదర్శిగా తనను ఎన్నుకున్నట్లు బేళ్ల అంజి బుధవారం తెలిపారు. రెండురోజుల క్రితం పుట్టపర్తిలోని కార్మిక, కర్షక భవనంలో జరిగిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, వెంకటేష్ ఆధ్వర్యంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. మండలానికి తనను రెండోసారి కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

### పెన్షనర్ల సంక్షేమానికి విరాళం

కదిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్షనర్ల అసోషియేషన్ అభివృద్ధికి ఉపాధ్యాయురాలు ఏస్తేర్‌రాణి రూ.పది వేలను బుధవారం విరాళంగా అందించినట్లు నాయకులు ఆత్మారెడ్డి, శివారెడ్డి, నాగభూషణం తెలిపారు. ఆమెకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

### ఉపాధి పనులు కల్పించండి

ఓబుళదేవరచెరువు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి కూలికి ఉపాధి పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ ఆదేశించారు. బుధవారం అమడగూరు, ఓడీసీ మండలాల్లో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల వారీగా పనులు సమీక్షించారు. సమావేశంలో క్లస్టర్ ఏపీడీ జ్యోతి, ఎంపీడీఓ రాబర్టు విల్సన్, ఏపీఓ సుధాకర్, సీఎల్ఆర్‌సీ శారద, సాంకేతిక, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### ఈతోడులో దూడలకు వ్యాక్సిన్

తనకల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈతోడు లో దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్ రెండో విడత కార్యక్రమాన్ని అనంతపురానికి చెందిన ఏడీ, డీఎల్ డాక్టర్ రామచంద్ర బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 19 వరకు నిర్వహిస్తారు. ప్రతి గ్రామంలోనూ 4,8 నెలల వయస్సులో ఉన్న ఆడ దూడలకు ఈ వ్యాక్సిన్ వేస్తారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి హరినాథ్‌రెడ్డి, పశుసంవర్థక సహాయకులు నిరీషా, మణికంఠ, విజయ్‌కుమార్, చిట్టెమ్మ, నాగేశ్వర్, మహేష్‌నాయక్, నరసింహులు పాల్గొన్నారు.

### పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్

ధర్మవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివానగర్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆర్డీఓ మహేశ్ బుధవారం తనిఖీ చేశారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటగదిని ఆయన పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, పరిశరాలు శుభ్రంగా ఉండేవిధంగా చూసుకోవాలని పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణకు సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న గదులను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను, మధ్యాహ్న భోజన రిజిస్టర్లను పరిశీలించారు.

## దుద్దుకుంటా.. నిజాలు తెలుసుకో..!



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కొత్తచెరువు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నిజానిజాలు తెలుసుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే బాగుంటుందని టీడీపీ నాయకులు హితవుపలికారు. బుధవారం స్థానిక లక్ష్మీ థియేటర్ ప్రాంగణంలో వారు మాట్లాడారు. నెహ్రూ నగర్ కాలనీకి సీసీ రోడ్డు మంజూరైందని, సీసీ రోడ్డు వేయడానికి పది రోజుల నుంచి అడ్డంకులను తొలగించడం జరుగుతోందని అన్నారు. ఇందులో భాగంగా ఓ మహిళ రోడ్డుకు నాలుగు అడుగులు ముందుకు వచ్చి మెటికలు నిర్మించుకుందని, వాటిని తొలగించాలని పది రోజుల నుంచి సూచిస్తున్నామని అన్నారు. వాటిని తొలగించకపోవడంతో రోడ్డు వేయడానికి ఇబ్బందిగా ఉందని ఆమెకు నచ్చచెప్పడానికి టీడీపీ, వైసీపీ నాయకులు వెళ్లారన్నారు. ఆమె బూతులు తిడుతూ నాయకులపైకి గొడవకు వచ్చిందన్నారు. తమ నాయకుడు సాలక్కగారి శ్రీనివాసులు పంచెను లాగగా.. ఆమె నుంచి ఆయన పంచెను విడిపించుకోవడానికి ప్రయత్నించాడే తప్ప.. కొట్టలేదన్నారు. వాస్తవాన్ని దాచి.. తమ నాయకుడు కొట్టారంటూ మాజీ ఎమ్మెల్యే తన ఫేస్ బుక్‌లో పోస్టు పెట్టడం ఆయన నీచ బుద్ధికి నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్యే అక్కడికి వచ్చిన వైసీపీ నాయకులను అడిగి తెలుసుకుని ప్రవర్తిస్తే బాగుంటుందని.. లేకపోతే ప్రజల్లో అబాసు పాలవుతారని అన్నారు. ఓటమితో అతని మైండ్ బ్లాక్ అయిందని, దీంతో ఇలాంటి పోస్టులు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీన, కిరణ్, సాయి, రాహుల్, నరేం ద్ర, వెంకటేశ్, లక్ష్మీనారాయణరెడ్డి, శేషంపల్లి పెద్దన్న, బోయ వెంకటనారాయణ పాల్గొన్నారు.

### విద్యాసామగ్రి పంపిణీ

బుక్కపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ పాఠశాలలో బుధవారం సత్యసాయి భక్తులు శ్రీవాణీ గ్లోసమ్స్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రి అందించారు. దాదాపు రూ.20 వేలు విలువచేసే వస్తువులు అందించారు. ఈ సందర్భంగా ఆ ట్రస్టు సభ్యులు వాణీ మాట్లాడు తూ.. సత్యసాయిబాబా చిన్నతనంలో ఇదే పాఠశాలలో చదువుకు న్నారని, ఇది చాలా పవిత్రమైన ప్రదేశమని, అలాంటి పాఠశాలలో చదువుకుంటున్న ఈ విద్యార్థులు చాలా అదృష్టవం తులని అన్నారు. అనంతరం సత్యసాయి భజన గీతాలు అలంపించి విద్యార్థులకు ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శ్రీవాణి, శ్రీనివాస్ ఏచూరి, అపర్ణ, హెచ్ఎం రామక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

### ఇకనైనా అధికారులు స్పందించేనా..?

తాడిమర్రి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తాడిమర్రి పడమటి చెరు వు (కొండమీదరాయునిచెరువు) స్థలాన్ని ఆక్రమించినా.. అక్రమ వి ద్యుత్ కనెక్షన్లు తీసుకున్నా.. సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. రైతులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదు. దీంతో ఆ రైతులు 15 రోజుల క్రితం కలెక్టర్‌ను కలిసి చెరువు ఆక్రమణలు, అక్రమ విద్యుత్ కనెక్షన్‌లు, అక్రమ బోరుబావుల తవ్వకాలపై ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్, రెవె న్యూ, విద్యుత్ శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులకు ఆ ఫిర్యా దు కాపీని పంపారు. బుధవారం ఇరిగేషన్ శాఖకు సంబంధించిన అధికారి తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈలకు ఆ ఫిర్యాదు కాపీని అందజేశారు. ఇన్నాళ్లు ఏమి ఎరగనట్లు వ్యవహరించిన మం డల అధికారులు ఇకనైనా స్పందిస్తారో.. లేదో.. వేచి చూడాలి మరి.

### పలుచోట్ల గ్రామ సభలు

ధర్మవరం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలలో రెవెన్యూ అధికారులు బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఆర్డీఓ మహేష్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● కుసుమవారిపల్లి, నరసంబట్లపల్లిలో..

ఓబుళదేవరచెరువు : మండలంలోని కుసుమవారిపల్లి, నరసంబట్లపల్లి గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు బుధవారం నిర్వహించారు. రెవెన్యూ సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. అనంతరం కొండకమర్లలో రస్తా సమస్యను పరిష్కరించారు. తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్టు విల్సన్, ఇన్‌ఛార్జీ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### నడిరోడ్డుపై ఆగిపోయిన ఆర్టీసీ బస్సు



మరో బస్సు బ్యాటరీ సాయంతో బస్సును స్టార్ట్ చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

అనంతపురం కల్చరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ధర్మవరం డిపో ఆర్టీసీ బస్సు నగరంలో నడిరోడ్డుపై మొరాయించింది. ధర్మవరం నుంచి పాత కృష్ణ థియేటర్ సమీపంలోకి రాగానే బ్యాటరీ డౌన్ కావడంతో బస్సు ఆగిపోయింది. దీంతో ప్రయాణికులను వెనుక వచ్చిన మరో బస్సులో ఎక్కించి బస్టాండుకు చేర్చారు. ఇంజిన్ స్టార్ట్ కాకపోవడంతో డ్రైవర్, కండక్టర్ బస్సును రోడ్డుపక్కనే దాదాపు గంటపాటు వదిలేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత డ్రైవర్, కండక్టర్ మరో బస్సును అక్కడికి తీసుకువచ్చి ఆ బస్సు బ్యాటరీ సాయంతో ఆగిపోయిన బస్సును స్టార్ట్ చేయించుకుని తీసుకువెళ్లారు.

### పాఠశాలల పనివేళల పెంపు సరికాదు

ఓబుళదేవరచెరువు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యం, ఏకగ్రత, రవాణా సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా పాఠశాలల పనివేళలను పొడిగించేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం విమర్శించారు. బుధవారం ఆయన స్థానకంగా మీడిమాతో మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలపై పాలకులు ప్రయోగాలు చేయడంతో లక్షలాది మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారని, అనేక పాఠశాలలు మూతపడ్డాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఐదు నుంచి 15 కిలో మీటర్ల దూరం నుంచి విద్యార్థులు పాఠశాలలకు వస్తున్నారని, పని వేళలు పెంచితే వారు ఇబ్బందులు పడతారని అన్నారు. అంతేకాకుండా విద్యార్జన కోసం ఏకాగ్రత్తతో ఎంత సేపు ఉండాలన్న అంశంపై వారి మానసిక శక్తిని అంచనా వేసి, పని గంటలు నిర్ణయించాలని అన్నారు. సమావేశంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శలు ఎన్‌సీ నరసింహులు, సోమశేఖర్ నాయక్, వెంకటాచలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

### ఏకపాదంపల్లిలో ఘనంగా
## కార్తీక దీపోత్సవం





అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి మూల విరాట్, పూజలో పాల్గొన్న భక్తులు

తాడిమర్రి : మండలంలోని ఏకపాదంపల్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి, ఈశ్వరస్వాములను ప్రత్యేకం గా అలంకరించి.. అభిషేకాలు నిర్వహించారు. వేలాదిమంది భక్తుల నడుమ సాయంత్రం 6 గంటలకు జ్వాలాతోరణంతో కార్తీక దీపోత్సవాన్ని ప్రారంభించారు.

## పుట్టపర్తిలో క్రీడామైదానాన్ని ఏర్పాటు చేయండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి



పుట్టపర్తి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రమైన పుట్టపర్తిలో అంతర్జాతీయ స్థాయి క్రీడామైదానాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో క్రీడలపై ఆశక్తి, ప్రతిభ ఉన్న క్రీడాకారులకు కొదవలేదని, క్రీడామైదానం లేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు, నగదు ప్రోత్సాహకాలు అందిస్తోందో తెలియచేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని వడ్డెర్ల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

### వడ్డెర్ల సమస్యలు ప్రస్తావించడంపై హర్షం



వడ్డె ఓబన్న విగ్రహం వద్ద మాట్లాడుతున్న వడ్డెర్లు

కొత్తచెరువు నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వడ్డెర్ల సమస్యలను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించడంపై వడ్డెర్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తంచేశారు. బుధవారం స్థానిక వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసిన టీడీపీ పట్టణ కన్వీనర్ ఒలిపి శీన మాట్లాడారు. తమ కష్టాలను ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో తమ సమస్యలు తీరుతాయన్నారు. వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లమాడ శంకర, వడ్డేపాపన్న, పెద్దన్న, శివ, భాస్కర్, నారాయణ, లింగమూర్తి పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన తాత్కాలిక చైర్మన్


బాధ్యతలు చేపడుతున్న బలరామిరెడ్డి

హిందూపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పురం మునిస్సిపాలిటీ తాత్కాలిక చైర్మన్‌గా 14వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలుపొందిన బలరామిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్ల క్రితం చైర్‌పర్సన్‌గా ఉన్న ఇంద్రజ ఇటీవల పదవికి రాజీనామా చేయడంతో నూతన చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. అయితే తెలుగుదేశం పార్టీ తరుపున చైర్మన్ అయ్యేందుకు పూర్తి మెజార్టీ ఉన్నా ఎలక్షన్ కమిషన్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న బలరామిరెడ్డిని తాత్కాలిక చైర్మన్(డెలిగెటెడ్)గా నియమించారు. ఆయన బుధవారం తన చాంబర్‌లోనే చైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. పట్టణ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. బాధ్యత స్వీకరించిన చైర్మన్‌ను మునిసిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎంఈ బాలసుబ్రహ్మణ్యం, సిబ్బంది, నాయకులు అభినందించారు.

## కేశవయ్యకు అభినందనల పరంపర

పెనుకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితుడైన జిల్లా సాధికార సమితి అధ్యక్షుడు కేశవయ్యకు పలువురు అభినందనలు తెలియజేశారు. టీడీపీ నాయకులు కొండాపురం శంకర్, అన్సర్, ఆంథ్రోస్, గోనిపేట వెంకటేశ్‌యాదవ్, జగదీశ్, జయప్ప తదితరులు బుధవారం కేశవయ్యకు పూలమాలలువేసి, శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం యాదవసంఘం నాయకులు కోగిర జయచంద్ర, శ్రీకాంత్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్ కూడా అభినందనలు తెలిపారు.

## వాహనాల తనిఖీ.. పలువురిపై కేసు నమోదు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సోమందేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండలంలోని హిందూపురం రోడ్డులో బుధవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్, సీటుబెల్ట్ ధరించని వాహనదారులపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

## ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు

హిందూపురం అర్బన్, నవంబరు 20,(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పులమతి రోడ్డులో నెలకొన్న శ్రీ రాజరాజేశ్వరీమాత ఆలయంలో బుధవారం ధ్వజస్తంభః ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త, ప్రధాన అర్చకుడు రాజ్‌కిషోర్ స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకుడు రమేష్‌రెడ్డి, కౌన్సిలర్ గిరిధర్, బిజేపీ యువమో ర్చా జిల్లా అధ్యక్షుడు రవి తేజారెడ్డిలు హాజరయ్యారు.

## పశువులకు బ్రూసెల్లోస్ నివారణ టీకా

పరిగి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పశువులకు సంభవిస్తున్న బ్రూసెల్లోస్ వ్యాధి నివారణకు బుధవారం మండల పరిధిలోని శ్రీరంగరాజులపల్లిలో వెటర్నరి లైఫ్‌స్టాఫ్ మండల ఆఫీసర్ జనార్దన్ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల నుంచి ఎనిమిది నెలల వయసుగల ప్రతి ఆవు దూడకు టీకా వేయాలని టీకా వేయించడంవల్ల అవి బ్రూసెల్లోస్ వ్యాధి బారినపడకుండా పరోక్షంగా అరికట్టవచ్చన్నారు.

## పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

పెనుకొండ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు ప్రీమియం బీమా చెల్లిస్తే నష్టపరిహారం పొందవచ్చని ఏఓ చందన పేర్కొన్నారు. బుధవారం మండలంలోని యర్రమంచి పొలంలో రైతులు సాగుచేసిన పంటపొలాలను సందర్శించి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ మాట్లాడుతూ వరిపంటకు డిసెంబర్ నెలాఖరులోపు వేరుశనగ, టమోటా పంటలకు డిసెంబర్15లోపు ప్రీమియం బీమా చెల్లించేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగమూర్తి, ఏఈఓ అశోక్‌కుమార్, ఆర్బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాడ్‌టచ్‌పై అవగాహన

సోమందేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మండ్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఎస్‌ఐ రమేష్‌బాబు విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. గ్రామంలో ఎవరైనా చాక్లెట్‌లు, బిస్కెట్‌లు ఇచ్చి ఒంటిపై చేతులు వేస్తే గురువులకు, తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు.

## హాస్టల్‌లో సౌకర్యాల కల్పనకు పథకం


హాస్టల్ బాలికల సమస్యలు తెలుసుకొంటున్న అధికారి

పావగడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీసీఎం హాస్టల్‌లోని సమస్యలను పరిష్కరించడానికి 126 అంశాలతో కూడిన విశేష పథకాన్ని రచించినట్లు బీసీఎం కమీషనర్ శ్రీనివాస్ ఆదేశాలు వెల్లడించారు. బుధవారం పావగడలో నెలకొన్న బీసీఎం హాస్టల్‌ను గ్రేడ్-1 అధికారి వేదమూర్తి పట్టణంలోని బీసీఎం హాస్టల్‌ను తనిఖీ చేశారు.

## బీటీ పల్లిలో ఘనంగా గౌరమ్మ పండుగ

గుడిబండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.టి.పల్లి, బళ్లేకట్ట తదితర గ్రామాల్లో బుధవారం గౌరమ్మ పండుగను ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించారు. గౌరమ్మ పండుగ కార్యక్రమాల్లో భాగంగా వివిధ సాంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించారు.

## వంక స్థలం ఆక్రమణదారులపై చర్యలు

పెనుకొండ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : వెంకటగిరిపాళ్యం గ్రామ సమీపంలో ఉన్న వంక స్థలం ఆక్రమణకు గురవుతుందని ఆక్రమించేవారిపై చర్యలు తీసుకోవాలని వెంకటగిరిపాళ్యం గ్రామస్థులు మండలంలోని గుట్టూరులో బుధవారం జరిగిన గ్రామసభలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వెంకటగిరిపాళ్యంకు చెందిన ఓ వ్యక్తి వంక భూమిని ఆక్రమించుకుని మినీ గోకులం షెడ్డు నిర్మిస్తున్నారని, షెడ్డు నిర్మాణం పూర్తయితే భారీ వర్షాలకు నీరంతా పొలాల గుండా వెళ్తుందని దీంతో తీవ్రంగా నష్టపోతామని పేర్కొన్నారు.

# చిన్న పిల్లలకు చిత్రహింసలు


ఆసుపత్రిలో వాడుతున్న క్యాన్నులాలు

- నాసిరకం క్యాన్నులాలతో ఇబ్బందులు
- బయట నుంచి తెచ్చుకుంటున్న రోగులు
- ఇలాంటివి మునుపెన్నడూ చూడలేదంటున్న నర్సులు

హిందూపురం అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని పసిపాపలు తమకు పలుమార్లు సూదులు ఎందుకు గుచ్చుతున్నారో తెలియక సూది గుచ్చిన ప్రతి సారి కెవ్వున అరుస్తున్నారు. పిల్లల ఏడుపులు చూసి తల్లితండ్రుల కళ్లలో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి. 'దేవుడా! అదేదో మాకు గుచ్చినా బాగుంటుంది. పిల్లల బాధలను చూడలేకున్నాము'. అంటూ జాలువారుతున్న కన్నీళ్ళను తుడుచుకుంటున్నారు. అసలు విషయం ఏంటంటే ప్రభుత్వం హిందూపురం ఆసుపత్రికి కొన్ని కంపెనీలతో ఎంఓయూ చేసుకొని క్యాన్నులాలు సరఫరా చేస్తోంది. అయితే అవి నాసిరకంగా ఉండడంతో వాటిని ఉపయోగించాలని చూస్తే వంగిపోతున్నాయని ఆసుపత్రి నర్సులు అంటున్నారు. దీంతో పిల్లల నరాలు అందక పలుమార్లు గుచ్చి గుచ్చి హింసిస్తున్నారని తల్లితండ్రులు ఆగ్రహిస్తున్నారు. డబ్బు పోయినా ఫరవాలేదని కొందరు బయట నుంచి కొనుక్కొని వస్తున్నట్లు తెలుస్తోంది. కొంత మంది పిల్లల బంధువులు 'ఏంటి మేడమ్ ఎందుకు ఇన్ని సార్లు గుచ్చుతున్నారు. మీకు పని రాదా?' అని అడుగుతున్నారు. దీంతో ఖంగుతిన్న నర్సులు సూదులు సరిగా లేకపోవడంతోనే ఇలా అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. దీంతో చేసేదిలేక నర్సులు ఆసుపత్రికి వచ్చిన వారితోనే బయట నుంచి తెప్పించి వాడుతున్నారు. మునుపెన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదని, ఇలాంటి నాసిరకం క్యాన్‌లాలు రాలేదని నర్సులు చర్చించుకొంటున్నారు. అయితే హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి దాదాపుగా వందకు పైగా ఓపి పేషంట్లు వస్తుంటారు. అందులో ప్రతి రోజు 20 నుంచి 30 దాకా అడ్మిషన్‌లు ఉంటాయి. వారందరికి ఆసుపత్రిలోని క్యాన్నులాలే వాడాలి. కానీ వాటిని వినియోగించాలంటే నర్సులు కూడా ఇబ్బంది పడుతున్నారు. అప్పుడప్పుడు తల్లితండ్రుల ఆగ్రహాలకు గురౌతున్నారు. నాణ్యత కల క్యాన్‌లాలు అందించాలని నర్సులు కూడా కోరుతున్నారు.


చిన్నారికి క్యాన్నులా అమర్చుతున్న దృశ్యం

### ప్రభుత్వమే సరఫరా చేసింది


లింగన్న, సూపరింటెండెంట్

ప్రభుత్వమే సరపరా చేసింది. కాబట్టి వాటితోనే నెట్టుకొస్తున్నాం. క్యాన్నులాలు సరిగాలేవని, నాణ్యత తక్కువగా ఉన్నాయని పైకి రాశాము. అత్యవసర పరిస్థితుల్లో కొంత మంది బయటనుంచి తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే వాటినే మేము వినియోగిస్తున్నాం.

## అడ్డూ అదుపు లేకుండా మట్టి దందా

సోమందేపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ మట్టి దందా అడ్డు అదుపులేకుండా కొనసాగుతోంది. అడ్డుకునే నాథుడు లేకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. చెరువులు, కొండలు, గుట్టల నుంచి మట్టినితోలి అడ్డగోలుగా లక్షలాది రూపాయిలు సంపాదిస్తున్నారు. అడ్డుకట్టవేయాల్సిన అధికారులు చోద్యంచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమ మట్టి దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. వివిధ నిర్మాణాలకు మట్టి అవసరాన్ని ఆసరాగా తీసుకుని స్వార్థపరులు రెచ్చిపోతున్నారు. అనుమతులు లేకుండానే వందలాది ట్రాక్టర్లు మట్టిని తరలిస్తున్నారు. ట్రాక్టర్ రూ.700చొప్పున అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో అనేకమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. తాజాగా రంగేపల్లిచెరువు నుంచి బుధవారం జేసీబీ సాయంతో పదుల సంఖ్యలో ట్రాక్టర్లను బహిరంగంగా తరలించారు. దీని వెనుక రాజకీయ నాయకుల అండదండలున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరైతే అడ్డుకున్నవారిపై దౌర్జన్యాలకు దిగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కుల ఆట కట్టించాలని కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్‌ను వివరణ కోరగా తాము ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని సమస్య తమ దృష్టికి రాలేదన్నారు.


రంగేపల్లి చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న దృశ్యం

## మళ్లీ రాత్రికి రాత్రే వెలసిన గుడిసెలు


తొలగించిన ప్రాంతంలో వెలసిన గుడిసెలు

హిందూపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కొట్నూరు సమీపంలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వేసుకున్న గుడిసెలను ఇటీవల రెవెన్యూ అధికారులు తొలగించారు. అయితే మళ్లీ వారే రాత్రికి రాత్రే గుడిసెలు వేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వారం క్రితం కొట్నూరు సమీపంలో స్టీల్ పరిశ్రమ వద్ద ప్రభుత్వ స్థలంలో కొంతమంది గుడిసెలు అక్రమంగా వేసుకున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు పోలీసులతో కలిసి వెళ్లి తొలగించారు. ఆది, సోమవారాలు రాత్రిళ్లు 30నుంచి 40దాకా గుడిసెలు అక్రమంగా వేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గుడిసెలు వేసుకున్నవారు వెంటనే తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## అడిగిన వెంటనే పనులు కల్పించాలి: ఏపీడీ

అగళి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధికూలీలు పనులు అడిగిన వెంటనే కల్పించాలని ఏపీడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిసిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధి కూలీల పని దినాలు పెంచాలని ఎలాంటి అవకతవకలకు అవకాశం కల్పించవద్దని ఆయన పేర్కొన్నారు. క్షేత్ర సహాయకులు సాంకేతిక సిబ్బంది తమ నిర్లక్ష్యాన్ని విడనాడాలని హెచ్చరించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్స్ ప్రక్రియ నిర్దేశించిన సమయంలోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## అవార్డు గ్రహీతలకు సన్మానం


అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అవార్డు పొందిన ఇద్దరు ఉర్దూ టీచర్లకు బుధవారం స్థానిక అజీజియా కాంప్లెక్స్‌లో ఎంఈఓ గంగప్ప, ఎంఈఓ-2 ప్రసన్నలక్ష్మీల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ పట్టణ పరిధిలోని నింకంపల్లి ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న సబిమాబాను, అహ్మద్‌నగర్‌లోని సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ పాఠశాలలో పని చేస్తున్న నసీఫాబేగంలకు రాష్ట్ర స్థాయి అవార్డులు వచ్చాయన్నారు. ఈ ఇద్దరు టీచర్లు అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలోఅజీజియా హెచ్‌ఎం రంగనాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి


ఈడిగ నారాయణప్ప (ఫైల్)

చిలమత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఈడిగ నారాయణప్ప (65) బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడు ఈడిగ నారాయణప్ప బుధవారం ఉదయం తన ద్విచక్రవాహనంలో సొంత పని నిమిత్తం హిందూపురం వెళ్లాడు. పని ముగించుకొని ఇంటికి వస్తూ లేపాక్షి మండలం 544-ఇ రోడ్డులోని గొంగటిపల్లి వద్ద తన వాహనం అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే అతడిని స్థానికులు చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు అతని బంధువులు తెలిపారు. మృతునికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

## కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలిగొల్లపల్లికి చెందిన వెంకటేష్ కుటుంబ కలహాలతో క్రిమిసంహారక మందు తాగి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుళ్లాయప్ప కుమారుడైన వెంకటేష్ భార్యతో ఘర్షణపడి మనస్థాపానికి గురై ఇంటిలో పొలంకోసం ఉంచిన పురుగుల మందును తాగాడు. అస్వస్థతకు గురైన అతడిని గోరంట్ల ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేసి అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

## ఏబీబీఎస్‌ఎస్ నాయకుడికి సన్మానం

సోమందేపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : అఖిల భారత బంజారా సేవాసంఘ్ రాష్ట్ర అధ్యక్షులు అంజేనాయక్‌ను బుధవారం కదిరి బంజారా నాయకులు సన్మానించారు. మండల పరిధిలోని నాగినాయనిచెరువుతాండాలోని ఆయన స్వగృహంలో కలిసి పూలమాలతో శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా అంజేనాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర బాధ్యతలను అప్పగించారన్నారు. ఆంధ్రలో 35లక్షల మంది బంజారాలు నివసిస్తున్నారన్నారు. వారిసమస్యల పరిష్కారానికి అభ్యున్నతికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు కదిరి బంజారా నాయకులు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు

చిలమత్తూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యాన్ని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎవ్వరూ నిర్లక్ష్యం చేయరాదని జిల్లా వైద్యశాఖ అధికారిణి డా. మంజువాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆసుపత్రిలోని వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయరాదన్నారు. ప్రధానంగా కాన్పు గదిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్టాఫ్ నర్స్‌కి సూచించారు. మందుల నిల్వల రికార్డులను పరిశీలించి మందుల కొరతపై ఆరా తీశారు. డాక్టర్ నుంచి వాచ్‌మెన్ వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రిలో పనిచేసే ప్రతి సిబ్బంది ఎఫ్‌ఆర్ఎస్ హాజరు తప్పక వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తేజశ్విని, సీహెచ్‌ఓ జయచంద్ర కుమార్, సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులకు బహుమతుల పంపిణీ

గోరంట్ల, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వివిధరకాల ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు, బహుమతులు, నోట్ పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎంఇఓ జయచంద్రారెడ్డి, గ్రంథాలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, పీడీ సూర్యనారాయణమ్మ,గ్రంథాలయ అధికారి రమేష్‌నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఊపందుకున్న టీడీపీ సభ్యత్వనమోదు

లేపాక్షి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధిష్టానం మేరకు మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులు సభ్యత్వ నమోదులో నిమగ్నమయ్యారు. బుధవారం కంచిసముద్రం పంచాయతీలో టీడీపీ నాయకులు ఈడిగ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## నేటినుంచి అయ్యప్ప భక్తులకు అన్నదానం

గోరంట్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దామరవొడ్డు అప్పయ్యస్వామి ఆలయంలో గురువారం నుంచి మాలాధారణ భక్తులకు మధ్యాహ్నం 12నుంచి 2 గంటలవరకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని గురుస్వామి రుషేంద్ర తెలిపారు.

## నజీర్ అహ్మద్‌కు ఎస్‌ఐగా ఉద్యోగోన్నతి

పెనుకొండ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కియా పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ నజీర్‌అహ్మద్‌కు ఎస్‌ఐగా పదోన్నతి లభించింది. గత రెండేళ్లగా ఇదేస్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహించడగా పదోన్నతిపై రోడ్ సేఫ్టీ ఎస్‌ఐగా పదోన్నతి లభించడంతో ఆయన్ను ఘనంగా సన్మానించారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

హిందూపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి లోకయుక్త, మానవహక్కుల న్యాయస్థానాలు అమరావతికి తరలించడంపై హిందూపురంలో న్యాయవాదులు బుధవారం నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సరిగాలేదంటూ వెంటనే దీన్ని విరమించుకోవాలన్నారు. మూడు రోజులపాటు విధులకు హాజరు కాకూడదని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సంఘం నాయకులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర, సిద్దు, సంపత్, ఉదయ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

**పెనుకొండలో..**

పెనుకొండ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాయలసీమలోనే హైకోర్టును ఏర్పాటు చేయాలని పెనుకొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కోర్టు ఆవరణంలో విధులు బహిష్కరించి మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన సందర్భంగా మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో హైకోర్టును రాయలసీమకు తీసుకొస్తామని గత ప్రభుత్వాలు హామీ ఇచ్చాయన్నారు. ఇప్పటికైనా హైకోర్టును ఈ ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగరాజు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్య పరిష్కారమే లక్ష్యం


ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గం అత్యంత వెనకబడినప్రాంతం అని, ఈప్రాంతంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకొన్నామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. బుధవారం పరిశ్రమల ఏర్పాటుపై కమిటీ వేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మడకశిర ప్రాంతంలో ఉపాధి కోసం కర్ణాటక రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాలకు దాదాపు 40 వేల కుటుంబాలు వలస వెళ్లాయని, వారందరికీ స్థానికంగా ఉపాధి కల్పించాలన్నదే ఎన్‌డీఏ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మడకశిరలో పర్యటించిన సందర్భంగా ఆయన దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని కోరగా సానుకూలంగా స్పందించి ఆదిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోతోపాటు మడకశిర మేనిఫెస్టోలో సైతం పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు హామీ ఇచ్చామని, అది నిలబెట్టుకొని తీరుతామని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కొత్తగా మందుగుండు తయారు చేసే పరిశ్రమతో పాటు మరో పరిశ్రమ రాబోతోందన్నారు.